
క్లుప్తంగా

సమష్టిగా ఉంటేనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామారావు

మాకవరపాలెం: పెన్షన్‌దారులంతా సమష్టిగా ఉన్ననాడే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం మండలాధ్యక్షుడు కోసూరు రామారావు తెలిపారు. తామరంలో ఆదివారం పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పెన్షన్‌దారుల నుంచి ట్రెజరీ అధికారులు వేలిముద్రల ద్వారా జీవన ధ్రువీకరణ పత్రాలను సేకరించారు. మండలంలో పెన్షన్‌దారులంతా ఏర్పాటు చేసిన రామరక్షణ సంఘ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రంగరాజు, రామరక్షణ సంఘ చైర్మన్ వానపల్లి నూకరాజు, సభ్యులు వెంకటరాజు, అచ్చేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గొలుగొండ: పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని సర్పంచ్ పత్తి రమణ తెలిపారు. పుత్తడిగైరంపేటలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ పథకం బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ పాలకులు, అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ విజేత నర్సీపట్నం



విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న కార్యదర్శి రమణ

నర్సీపట్నం: పట్టణంలో నర్సీపట్నం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని ఆరు జట్లు పాల్గొన్నాయి. నర్సీపట్నానికి చెందిన మనోజ్ జట్టు విజేతగా, కులదీప్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. రెండు టీమ్‌ల కెప్టెన్స్‌కు అసోసియేషన్ కార్యదర్శి తోలం రమణ నగదు, మెమోంటో అందజేశారు.

ఎస్ఈబీ సీఐగా సునీల్ కుమార్



నర్సీపట్నం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సునీల్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆమదాలవలస ఎస్ఈబీ నుంచి నర్సీపట్నానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ శ్రీనివాస్ పాలకొండ బదిలీ అయ్యారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వాల పెద్దపీట



వైద్యంపై అవగాహన కల్పిస్తున్న సన్యాసిరావు

కె.కోటపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ, సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. ఆదివారం పోతనవలసలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. జాబ్‌కార్డుదారులకు గ్రామంలోనే వంద రోజుల ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏవో సోమశేఖర్, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, హౌసింగ్ ఏఈ నాయుడు, ఎంఈవో డీవీడీ ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాల పండగ నేడు

- సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు సిద్ధం
- ఎం. కోటపాడులో ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రైతు భరోసా కేంద్రం



ఎం. కోటపాడులో గ్రామ సచివాలయ భవనం

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకే పాలన తెచ్చారు. ఈ నేపథ్యంలో పల్లె ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేస్తూ గ్రామ సచివాలయ సముదాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని కోసం కోట్లాది రూపాయలతో నిర్మించిన శాశ్వత భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఎం. కోటపాడులో సర్వం సిద్ధం చేశారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు మాడుగుల ఏఎంసీ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్‌లు శేష ఫణి, కోట్ని లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు నాడు –నేడు పథకంలో ఎం. కోటపాడు ఎంపీయూపీ పాఠశాలలో రూ.22 లక్షలతోనూ, ఎం.కె.వల్లాపురం ఎంపీపీ పాఠశాలలో రూ.11 లక్షలతోనూ నిర్మించిన భవనాలను ప్రారంభిస్తారన్నారు. గ్రామ సచివాలయం రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రం రూ.21.80 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రూ.17.50 లక్షలతో నిర్మించామన్నారు. వీటితోపాటు సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తయిందన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

నేడు 'గడపగడపకు'

ఎం. కోటపాడు గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు ఆదివారం తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు.



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



అప్పలరాజుపురం హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాడుగుల రూరల్: అప్పలరాజుపురం జిల్లా పరిషత్ హైస్కూలులో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని సందడి చేశారు. ఇక్కడ 31 సంవత్సరాల క్రితం చదువుకున్న వీరంతా దూర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార, తదతర రంగాల్లో స్థిరపడ్డారు. 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన 60 మంది కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పటి హెచ్‌ఎం భూపతి అప్పారావు, సైన్సు ఉపాధ్యాయుడు నర్సిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆత్మీయ కలయిక పూర్వ విద్యార్థులు నందారపు రమణబాబు, పుట్టా రవికృష్ణ, కాళ్ల అప్పారావు, మట్టా అప్పలకొండ, బీ శ్రీనివాసరావు, పంతం ప్రసాదు, వంశీకృష్ణ, ఎస్ శ్రీనివాసరావు కృషి చేశారు.

బుడ్డిబందలో రూ.2 లక్షలతో సీసీరోడ్డు



భూమిపూజ చేస్తున్న గ్రామపెద్దలు

రావికమతం: కవగుంట శివారు బుడ్డిబందలో రూ.2 లక్షలతో సీసీరోడ్డు పనులకు సర్పంచ్ సూర్యకుమారి వరహాలు, గ్రామపెద్దలు ఆదివారం భూమిపూజ చేశారు. ఇక్కడ కాలనీలో గుళ్ల పద్మనాభం దొర, రొబ్బా దేముడు దొర, వీరభద్ర రాజు, కిముడు దేముడు దొర తదితర కుటుంబాలు ఏళ్ల తరబడి సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ ధర్మశ్రీకి వారు విన్నవించడంతో నిధులు మంజూరు చేశారు.

చురుగ్గా కులగణన సర్వే



నాతవరం: ములగపూడిలో కుల గణన సర్వే చేస్తున్న సిబ్బంది



కె.కోటపాడు: చౌడువాడలో కులగణన సర్వే చేస్తున్న వలంటీర్



గొలుగొండ: చంద్రయ్యపాలెంలో కులగణన చేస్తున్న వలంటీరు

గొలుగొండ/కె.కోటపాడు/నాతవరం: గ్రామాల్లో చురుగ్గా కుల గణన సర్వే కొనసాగుతోంది. గొలుగొండ మండలం పాతమల్లంపేట, గొలుగొండ, పుత్తడిగైరంపేట, అమ్మపేట తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామ సచివాలయం సిబ్బందితోపాటు వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి కులాల వారీగా జాబితా సేకరించారు. కె.కోటపాడు మండలం చౌడువాడ, గుల్లేపల్లి, గొండుపాలెం, కింతాడ, కె.కోటపాడు, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. నాతవరం మండలంలో కుల గణన సర్వేను ఆదివారం తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాసనాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, సూపర్‌వైజర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

రూపురేఖలు మారిన వడ్డాది జంక్షన్



గత పాలనలో నిల్వ నీటిలో నుంచి అవస్థలు పడి వెళ్తున్న ప్రయాణికులు



ఆక్రమణలు తొలగించి విశాలంగా మారిన వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్

బుచ్చెయ్యపేట: పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ ప్రస్తుతం రూపురేఖలు మారిపోయింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలతో పాటు నాల్గు రోడ్ల జంక్షన్ పెద్ద పెద్ద గోతులతో ఉండేది. ఏ మాత్రమూ వర్షం కురిసిన మోకాల లోతు వరకు నీరు నిల్వుండిపోయి పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డుకిరువైపులా మురుగు పోయే కాలువలు ఏర్పాటు లేకపోవడంతో దుకాణదారులు, నివాసాల వద్ద వాడుక నీరు రోడ్డు మీదకు వచ్చి మురుగు కూపంలా ఉండేది. గత తెలుగుదేశం పార్టీ పాలనలో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుతోపాటు ఇక్కడ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, మిగిలిన టీడీపీ నాయకులు బీఎన్ రోడ్డును, వడ్డాది జంక్షన్ రూపురేఖలు మారుస్తామని నిధులు మంజూరు చేశామని పలుమార్లు ప్రకటనలు చేసి శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత వడ్డాది జంక్షన్ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాల్గు రోడ్ల జంక్షన్ అభివృద్ధి చేయాలని మండల, స్థానిక పార్టీ నాయకులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీని కోసం రూ.80 లక్షలు మంజూరు చేయించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, వీరవల్లి నాల్గు రోడ్ల వైపు రోడ్డు ఆక్రమణలను తొలగించారు. మురుగు బయటకు పోయేలా కాలువలు ఏర్పాటు చేశారు. నాల్గు రోడ్లను ఎత్తు చేసి గోతులు పూడ్చి కొత్తగా తారురోడ్డు వేయడంతో విశాఖపట్నం, పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి నాల్గు రహదారుల్లో వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు గోతులు బెడద తప్పింది. వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ అభివృద్ధి చెంది రూపురేఖలు మారడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



సారె ఊరేగింపులో భక్తులు

రోలుగుంట: కుసుర్లపూడిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సారె, చీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ సబ్బవరపు పెద్దినాయుడు, హైస్కూలు ఎస్ఎంసీ చైర్మన్ గొల్లు రాజబాబు పాల్గొన్నారు.

వాడవాడలా రామనామం



మాకవరపాలెం: ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు, భక్తులు



నాతవరం: వెన్నలపాలెంలో ఆలయాల శుద్ధి చేస్తున్న మహిళా భజన బృందం



రావికమంతం: దొండపూడిలో శ్రీరాముని జెండాలను సిద్ధం చేస్తున్న యువకులు

మాకవరపాలెం: అయోధ్యలో సోమవారం రాముడి విగ్రహ ప్రతిష్ట నేపథ్యంలో ఆదివారం సాయంత్రం సీతారాముల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. స్థానిక రామాలయం నుంచి ప్రారంభించిన ఈ ఊరేగింపు అన్ని వీధుల్లోనూ కొనసాగింది. ఈ సందర్భంగా చిన్నారులు సీతారాములతోపాటు లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషధారణలో ఆకట్టుకున్నారు. మహిళలు, చిన్నారులు కోలాటాల నడుమ ఊరేగింపు కార్యక్రమం జరిగింది. సోమవారం ఉదయం నుంచి రామాలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కమిటీ తెలిపింది.

నాతవరం: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేసేందుకు శుభ్రం చేసి అలంకరిస్తున్నారు. నాతవరం రామాలయంలో సోమవారం తెల్లవారు నుంచే మహిళలతో భజనలు, కోలాటాల ప్రదర్శనతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నారు. వెన్నలపాలెంలో అంజనేయస్వామి, తలుపులమ్మ తల్లి ఆలయాల పాటు నూతన రామాలయం వద్ద పలు పూజా కార్యక్రమాలు చేసేందుకు మహిళా భజన భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

- తారువలో ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి
- రూ. 1.20 కోట్లతో ట్యాంకులతోపాటు కుళాయిల ఏర్పాటు



తారువ బీసీ కాలనీలో కుళాయి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి సదుపాయం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలో జలజీవన్ మిషన్ నుంచి రూ.1.20 కోట్లతో నిర్మించిన మంచినీటి ట్యాంక్, ఇంటింటా కుళాయిలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ నిధులతో 60 వేల లీటర్ల సామర్థ్యం ట్యాంక్, బీసీ కాలనీలో 10 వేల లీటర్ల ట్యాంక్‌ను నిర్మించి ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. మహిళల కోలాట ప్రదర్శనల మధ్య బీసీ కాలనీలో నిర్మించిన ట్యాంక్, ఇంటింటా కుళాయిల వద్ద పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం బూడి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో తాగునీటి కోసం మహిళలు నానా అవస్థలు పడేవారన్నారు. సీఎం జగన్ ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి అక్కచెల్లెమ్మలకు శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, రాష్ట్ర సంయుక్త మహిళా కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీ లలితానాయుడు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్ గొంప వరహాలమ్మ, ఎంపీటీసీ అవుగడ్డ రమాదేవి, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మి, ఉగ్రూకుల గంగాభవానీ, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, ఉప సర్పంచ్ బూడి సూర్యనారాయణ, గొర్రుపోటు తమ్మునాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు

జిల్లా స్థాయి పోటీ విజేత సింహాద్రిపురం



మాడుగుల: ఎడ్ల పరుగు పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



దేవరాపల్లి: తీర్థ మహోత్సవ గోడ పత్రికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి



కె.కోటపాడు: రావాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు



బోయిలకింతాడలో ఉరకలేస్తున్న ఎద్దు

దేవరాపల్లి: బోయిలకింతాడలో మరిడిమాంబ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఎడ్ల బళ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. వీటిని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు, గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పది ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. చోడవరం మండలం సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయ స్వామి ఎడ్లు విజేతగా నిలిచాయి. హర్షవర్ధన్‌నాయుడు(దండిసురవరం) ద్వితీయ, సంపత్‌వినాయక(సర్పాపురం) తృతీయ, నాల్గు, ఐదు, ఆరో స్థానాల్లో మజ్జి రాజేష్, అద్దేపల్లి అనిల్‌కుమార్, శ్రీకృష్ణ పరమాత్మ(చుక్కపల్లి) ఎడ్లు నిలిచాయి. ఏడో స్థానంలో అద్దెపల్లి పాలవెల్లి(చుక్కపల్లి), 8వ స్థానంలో సిద్ధి వినాయక(లక్కవరం), 9వ స్థానంలో శ్యామ్‌కుమార్(లక్ష్మీపురం) ఎడ్లు నిలిచాయి. వీరికి వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున బహుమతులను సర్పంచ్ బాబురావు, గ్రామ పెద్దలు దాసరి వెంకునాయుడు, అన్నం రామునాయుడు, కొమర బాబూరావు, అన్నం రాము, అన్నం వెంకటరావు, బొబ్బిలి రాము, తుంపాల నాయుడు అందజేశారు.

నేడు చౌడువాడలో ఎడ్లబళ్ల పోటీలు

కె.కోటపాడు: చౌడువాడ మేజర్ పంచాయతీ గవరపేటలో సోమవారం సీతారాముల తీర్థం నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు నిర్వహించనున్నారు. మొదటి 14 స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు నగదు పురస్కారాన్ని అందించనున్నారు. పాల్గొనే ఎడ్లబళ్ల యజమానులు ఇతర వివరాలకు 9966485764 సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

మాడుగుల: సత్యవరంలో ఆదివారం అత్యంత వైభవంగా మరిడిమాంబ తీర్థం జరిగింది. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పోటీలు తిలకించడానికి గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 10 ఎడ్ల బళ్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఆరు జతలకు బహుమతులను కమిటీ సభ్యులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణిరామారావు, ఉప సర్పంచ్ ఒమ్మలి పెంటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గోకేడ అప్పలనాయుడు, యలమంచిల రమణ, శనివాడ వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా రావాలమ్మ తీర్థం

కె.కోటపాడు: మండలంలో కె.కోటపాడు, కింతాడ గ్రామాల ఆరాధ్యదేవత రావాలమ్మ తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిమాన్వితమైన అమ్మవారిగా గుర్తింపు పొందిన రావాలమ్మకు రెండు గ్రామాల ప్రజలు పూజలు చేశారు. తీర్థం సందర్భంగా గ్రామంలో సందడి కోలాహలం నెలకొంది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: కొత్తపెంట పైడిమాంబ తీర్థ మహోత్సవ గోడ పత్రికను ఆదివారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, గ్రామ పెద్దలు తీర్థానికి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తీర్థ మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించి, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2వేలు, రూ.వెయ్యి చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, చిరికి శంకరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ పాల్గొన్నారు.

రేపు ఒమ్మలిలో మోదకొండమ్మ తీర్థం

మాడుగుల: ఒమ్మలిలో ఈ నెల 23న మోదకొండమ్మ తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, నేల వేషాలుతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

జాలంపల్లిలో 210 మందికి వైద్య పరీక్షలు



జాలంపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్: జాలంపల్లిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ దరి అనిల్ నీరుకొండ ఆస్పత్రి సహకారంతో, కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 210 మందిని 12 మంది వైద్యులు పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గిరిజన గ్రామ పంచాయతీ శివారు గ్రామాల నుంచి వచ్చిన వారికి వైద్య సేవలందించారు. వీరిలో 56 మందిని వివిధ రకాల చికిత్సల కోసం రిఫర్ చేశారు. వీరిని సోమవారం ప్రత్యేక బస్సులో ఆస్పత్రికి తరలించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్వో ఉదయకుమార్, మాజీ సర్పంచ్ పల్లా శ్రీనివాసరావు, ఎం. రాజాబాబు, కన్నయ్యపడాల్ పాల్గొన్నారు.